673) ముఖారి

ప॥ హేయము తనవాసన లేలమానును। చీయన్న మానదిదే చెప్పరానిమాయ॥

చ॥ జంగిలిమనుజునకు వరుస బాపమే చవి। అంగవించవలదంటే నగ్గలమౌను।
ముంగిట నిల్లాలుండగ ముట్టగోరు బరస్త్రీల। యెంగిలి కీరెండు సరె యిదివో మాయ॥

చ॥ పరగినజీవునికి పంచేంద్రియాలే సుఖము। ధర నెంతగాలమైన తనివిలేదు।
సిరులు దనకుండినా జేయిచాచు బరులకు। యిరువు లెరగగరాదు యిదివో మాయ॥

చ॥ శ్రీవేంకటేశ్వరుడు చేరి యాత్మలో నుండగ। భావించు నితనికృప ఫలించునాడు।
పూవువంటి సంసారము పొదుగుకవుండగాను। ఆవటించు బుణ్యఫలా లదివో మాయ॥